పండక్కి..అప్పాలెట్లా!

-భంగుమంటున్న వంటనూనెలు -లీటర్‌పై దాదాపు రూ.10 నుంచి 15 పెరుగుదల





హైదరాబాద్,జనవరి 12, ప్రభాతవార్త: వంటనూనెల ధరలు భగ్గుమంటున్నాయి. ఎంతకూ తగ్గమంటున్నాయి. సంక్రాంతి పండుగ వేళ సామాన్యులకు దడ పుట్టిస్తున్నాయి. పిండివంటల నూనెలు మండిపోతున్నాయి. ఇక రోజూ వంటల్లో సరిపడా నూనె వాడేందుకే ఒకటికి, రెండుసార్లు ఆలోచించే పరిస్థితి వచ్చేసింది. హైదరాబాద్ నగరంలో రోజుకు వందల టన్నుల వంట నూనెల అమ్మకాలు జరుగుతున్నాయి.గృహ అవసరాలకే కాకుండా హోటల్స్, క్లబ్బులు, బార్లలో అత్యధికంగా వివిధరకాల వంట నూనెలు భారీగా వినియోగిస్తుంటారు. సంక్రాంతి పండుగ రావడంతో నగరంలో వంట నూనెల డిమాండ్ మూడింతలు ఎక్కువైంది. దీంతో నూనె ధరలు ఆమాంతం పెరిగాయి. హోల్సెల్ మార్కెట్ అన్ని రకాల నూనెలపై ధర రూ. 5 నుంచి రూ.8 పెరిగింది. రిటైల్, బహిరంగ మార్కెట్లో ప్రతి లీటరు నూనెపై రూ.10 నుంచి రూ.15 పెరిగింది. అన్ని రకాల నూనెల ధరలు భగ్గుమంటున్నాయి.పామాయిల్, రిఫైన్డ్ ఆయిల్, వేరుశనగ, రైస్ బ్రాన్.. ఇలా అన్ని రకాల నూనె ల ధరలు భారీగా పెరిగాయి. వంట నూనెలకు సంబంధించి హోల్సేల్ ధరలు, రిటైల్ మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం రూ.10 నుంచి రూ.20 వరకు ఉంది. హోల్సేల్ మార్కెట్లో పామాయిల్ కిలో ధర రూ.110 నుంచి రూ. 120కు చేరింది. రిటైల్ మార్కెట్లో రూ.140కు చేరింది. సన్ఫ్లవర్ ఆయిల్ హోల్సేల్ మార్కెట్లో కిలో రూ. 130 నుంచి రూ.140 మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.150- 160 పలుకుతోంది. కిలో వేరు శనగ నూనె ధర నెల క్రితం రూ.150 ఉండగా, ఇప్పుడు రూ.165కు పెరిగింది. వీటితో పాటు రైస్ బ్రాన్ ఆయిల్ ధర రూ.140 నుంచి రూ.150 ఉండగా, ప్రస్తుతం రూ.160 పలుకు తోంది.ఈ స్థాయిలో వంటనూనెల ధరల మంట కు కారణం నూనెలపై దిగుమతి సుంకం పెరగడ మేనని వ్యాపారులు అంటున్నారు. రాష్ట్రానికి ది గుమతయ్యే ముడి ఆయిల్పై సుంకాన్ని ప్రభుత్వం పెంచిందని, అందుకే ధరలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. వంటనూనెల ధరలు మున్ముందు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

పర్యావరణ కాలుష్యం నివారించేందుకు ఈవేస్ట్ సేకరణ

-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

వివరాలు అడిగి తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్

చిక్కడపల్లి జనవరి 12 (ప్రభాతవార్త): పర్యావరణానికి హాని కలగకుండా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, రీసైక్లింగ్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. సోమవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి రీసైక్లింగ్ చేసే బాగ్ లింగంపల్లి పరిధిలోని సర్కిల్ 15 ఈవేస్ట్ సేకరణ కేంద్రాన్ని కమీషనర్ ఆర్.వి. కర్ణన్, అడిషనల్ కమిషనర్ (శానిటేషన్) సి.ఎన్. రఘుప్రసాద్, జోనల్ కమిషనర్ సి. రవికిరణ్, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ రామాంజుల రెడ్డి లతోకలిసి తనిఖీ చేశారు.నగరవ్యాప్తంగా రెండు రోజులపాటు నిర్వహిస్తున్న మెగా ఈవేస్ట్ శానిటేషన్ డ్రైవ్లో భాగంగా ఈ పర్యవేక్షణ జరిగింది. ఫీల్డ్ స్థాయి సిబ్బందితో మాట్లాడి, ప్రత్యేక వాహనాలు, ప్రత్యేక కౌంటర్ల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ సేకరణ కేంద్రాల పర్యవేక్షణ నగరంలో ఏర్పాటు చేసిన ఈవేస్ట్ కేంద్రాల పనితీరును నిశితంగా పరిశీలించాలని సూచించారు. పర్యావరణ కాలుష్యం, ఆరోగ్య సమస్యలను నివారించేందుకు పాత ఎలక్ట్రానిక్ వస్తువులను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, పునఃచక్రీకరణ చేయడమే ఈ డ్రైవ్ ప్రధాన లక్ష్యం అని అన్నారు. కమిషనర్ అక్కడ ఏర్పాటు చేసిన ఈవేస్ట్ సేకరణ శిబిరాలు, ప్రత్యేక వాహనాలు, కౌంటర్ల పనితీరును పరిశీలించారు. గృహాలు, వాణిజ్య సంస్థల నుండి సేకరించిన ఈ వ్యర్థాలను దుండిగల్లోని అధీకృత ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయంగా రీసైకిల్ చేస్తారని, ప్రజలు తమ వద్ద ఉన్న పనికిరాని ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను బాధ్యతాయుతంగా ఈ కేంద్రాల్లో అప్పగించాలని కమిషనర్ కోరారు.ముషీరాబాద్ సర్కిల్ 15లోని అన్ని వార్డులలో ఈవేస్ట్ సేకరించడానికి జీహెచ్ఎంసీ ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కండిషనర్లు.చిన్న పరికరాలు: మిక్సర్లు, గ్రైండర్లు, ఐరన్ బాక్సులు, హెయిర్ డ్రైయర్లు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు, ఎలక్ట్రానిక్స్: టీవీలు, మ్యూజిక్ సిస్టమ్స్, కెమెరాలు, బ్యాటరీలు, ఇన్వర్టర్లు, యు పి ఎస్ లు సేకరిస్తారు. బాగ్ లింగంపల్లి వంటి ప్రాంతాలలో పేరుకుపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, సేకరించిన వ్యర్థాలను దుండిగల్‌లోని ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించి, నిబంధనల ప్రకారం రీసైక్లింగ్ చేస్తారు.ఈ రెండు రోజులలో మీ ఇంట్లో లేదా ఆఫీసులో ఉన్న నిరుపయోగమైన ఎలక్ట్రానిక్ వస్తువులను మీ ప్రాంతంలోని జీహెచ్ఎంసీ సేకరణ వాహనాలకు లేదా నిర్ణీత కేంద్రాల్లో అందించాలని అధికారులు కోరారు.

శిక్షణతో భవిష్యత్తు పరిశోధనా ప్రాజెక్టులు రూపొందించుకోవచ్చు

-ఉపకులపతి డా.జ్ఞాన ప్రకాశ్

-21రోజులకు ముగిసిన శిక్షణ

అత్తాపూర్ జనవరి12,ప్రభాతవార్త : పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 21 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా సంక్రమణ వ్యాధుల గుర్తింపుకు ఆధునిక మాలిక్యులర్ బయాలజీ సాధనాలు, వన్ హెల్త్ మరియు ఫైలోజెనెటిక్ దృక్పథం" అంశంపై డిసెంబర్ 23 వ తేదీ నుండి నిర్వహించారు.ఈ వింటర్ స్కూల్‌లో ఆధునిక మాలిక్యులర్ డయాగ్నస్టిక్ పద్ధతులు, ఫైలోజెనెటిక్ విశ్లేషణ, బయోఇన్ఫర్మాటిక్స్, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యాధి గుర్తింపు వంటి అంశాలపై శిక్షణ అందించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న శిక్షార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు.సోమవారం ఈ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. ఎం. జ్ఞాన ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిజిస్ట్రార్ డా.శరత్ చంద్ర, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ డా. ఉదయ కుమార్, అసోసియేట్ డీన్, పశువైద్య కళాశాల, మామునూర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, అసోసియేట్ డీన్, పశువైద్య కళాశాల రాజేంద్రనగర్ డా. డి. మాధురి హాజరైయ్యారు. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్‌గా డా. విజయ కుమార్, కో డైరెక్టర్లుగా డా. ఎస్. వంశీ కృష్ణ ,డా. జి. విశ్వేశ్వర్ కుమార్ సేవలందించారు.ఈ సందర్భంగా ఉపకులపతి డా.జ్ఞాన ప్రకాశ్ మాట్లాడుతూ.. వన్ హెల్త్ దృక్పథం అనేది వివిధ రంగాల నుంచి ఆలోచనలు, భావనలు కలగలిపినప్పుడే సార్థకమవుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెరిగిందని, ఆలోచనల మార్పిడి జరిగిందని తెలిపారు. ఈ శిక్షణలో పొందిన జ్ఞానంతో భవిష్యత్తులో భాగస్వామ్య పరిశోధనా ప్రాజెక్టులు రూపుదిద్దుకునే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.రిజిస్ట్రార్ డా. ఎ. శరత్ చంద్ర మాట్లాడుతూ, శిక్షణ పొందినవారిని అభినందించారు.ఈ శిక్షణలో నేర్చుకున్న విషయాలను వారి వారి కళాశాలలో ఉపయోగించాల్సిందిగా తెలిపారు. డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ డా. ఎం. ఉదయ కుమార్ అసోసియేట్ డీన్, పశువైద్య కళాశాల, మామునూర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి , అసోసియేట్ డీన్, పశువైద్య కళాశాల, రాజేంద్రనగర్ డా. డి. మాధురి మాట్లాడుతూ శిక్షణ పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన శిక్షణా కార్యక్రమ డైరెక్టర్ డా. ఏ. విజయ కుమార్, కోడైరెక్టర్లు డా. ఎస్. వంశీ కృష్ణ మరియు డా. జి. విశ్వేశ్వర్ కుమార్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు మరియు కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

సార్.. మా ఏరియా చెరువులపైనా ఓ కన్నేయండి..!

ఆక్రమణలు తొలగించి.. అభివృద్ధి పరచండి హైడ్రా కమిషర్‌కు వివిధ కాలనీల ప్రజలు వినతి

హైడ్రా కమిషనర్‌కు రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న వివిధ కాలనీల ప్రజలు

హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త: నగరంలో అభివృద్ధి చెందిన చెరువులను చూసి.. తమ ప్రాంతాల్లో ఉన్న వాటిని కూడా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. చెరువులు కబ్జా అవ్వకుండా కాపాడాలంటున్నారు. చెరువులను అనుసంధానం చేసిన వరద కాలువలను పునరుద్ధరించమని అడుగుతున్నారు. ఒకప్పటి చెరువుల వైభవాన్ని చెబుతూ.. మంచనీటి సరస్సులగా మార్చమని కోరుతున్నారు. జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్, ప్రగతినగర్ చెరువు, కాటేదాన్‌లోని నూర మహ్మద్‌కుంట, ఫిల్మ్‌నగర్ చెరువు ఇలా నగరం నలుమూలల నుంచి చెరువులను అభివృద్ధి చేయాలని డిమాండ్లు ఊపందుకున్నాయి. అంబర్‌పేట లోని బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్న్ ఉద్ దౌలా చెరువు పర్యాటక ప్రాంతాలుగా మారాయని.. తమ ప్రాంతంలో ఉన్న చెరువుల దుర్గంధాన్ని వదిలించాలని ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. అలాగే రహదారులు, పార్కుల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులూ అందాయి. లే ఔట్‌లోని రహదారులను, పార్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 76 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా కమిషనర్ రంగనాథ్ గారు పరిశీలించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు దారల ముందే పరిష్కార బాధ్యతలను అప్పగించారు. కొన్ని ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి వస్తామని కమిషనర్ వారికి చెప్పారు.

ఫిర్యాదులు ఇలా....

జీడిమెట్ల పారిశ్రామిక వాడను ఆనుకుని ఉన్న ఫాక్స్ సాగర్ కబ్జాలను తొలగించి..మరో ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో కోరారు. వెయ్యికి పైగా ఆక్రమణలున్నాయని వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఫాక్స్ సాగర్ నుంచి నేరుగా హుస్సేన్ సాగర్‌కు ఉండే వరద కాలువ కూడా పలుచోట్ల కబ్జాలకు గురైందని.. పునరుద్ధరించాలని కోరారు. తాగునీటితో పాటు.. సాగునీటిని అందించిన ఈ చెరువును పునరుద్ధరిస్తే అనేక మత్స్యకార కుంటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని.. అక్కడ నివాసిత ప్రాంతాలకు ఆహ్లాదకరంగా మారుతుందన్నారు. మరో పర్యాటక ప్రాంతంగా దీనిని అభివృద్ధి చేయవచ్చునని పేర్కొన్నారు. -రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామంలో సర్వే నెం. 223లో ఉన్న మాలకుంట చెరువును హైడ్రా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. చెరువు కట్టను ధ్వంసం చేసి నీటిని బయటకు వదిలేసి ఆక్రమణలకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చెరువులో చేపలను పెంచుకుంటూ జీవనోపాది పొందేవాళ్లమని.. ఇప్పుడు తమ బతుకుదెరువు కూడా కోల్పోయామని వాపోయారు. మాలకుంట చెరువు కట్టను వెంటనే పునర్నిర్మించి, చెరువులో వేసిన సిమెంట్ పైపులను తొలగించాలని కోరారు. వెంటనే నీగిలి హద్దు రాళ్లు వేసి చెరువు ఆక్రమణకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రాథమిక మత్స్య పారిశ్రమిక సంఘం సభ్యులు ప్రజావాణిలో కోరారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గులు వేయడానికి రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

నగరంలో మొదలైన సంక్రాంతి వేడుకలు

నగరంలో వలు కాలనీలలో తిరుగుతున్న గంగిరెద్దులు

నేటి నుంచి అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

కంటోన్మెంట్, జనవరి 12 ప్రభాతవార్తః సంక్రాంతి సంబరాలను మరింత ప్రత్యేకంగా మార్చేందుకు హైదరాబాద్ సిద్ధమైంది. మంగళవారం నుంచి 15వ తేదీ వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఫెస్టివల్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నగరవాసులను రంగుల ప్రపంచంలోకి తీసుకెళ్లనుంది. ఈ కైట్ ఫెస్టివల్క ప్రపంచంలోని పలు దేశాల నుంచి ప్రముఖ కైట్ ఫ్లయర్స్ హైదరాబాద్కు రానున్నారు. విదేశాల నుంచి వచ్చే అతిథులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది ఫెస్టివల్లో ప్రత్యేక ఆకర్షణగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిలవనుంది. జనవరి 16, 17, 18 తేదీలలో ఈ హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్ట్ నిర్వహించనుండగా.. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆకాశంలో ఎగిరే బెలూన్లు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ వేడుకలకు అందరూ ఆహ్వానితులే. ముఖ్యంగా చెప్పుకోదగిన విషయం ఏమిటంటే.. ఈ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్స్ పూర్తిగా ఉచితంగా నగరవాసులు, పర్యాటకులు ఆస్వాదించవచ్చు. రంగులు, రుచులు, టెక్నాలజీ మేళవించిన ఈ హైదరాబాద్ కైట్ ఫెస్టివల్ సంక్రాంతి వేడుకలకు మరింత అబ్బురపరచనుంది.ఫొటోరైటప్

పతంగుల పండగకి రండి

- సిఎంకు ఎమ్మెల్యే దానం ఆహ్వానం

పతంగితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో దానం నాగేందర్, కొండా సురేఖ, అనీల్‌కుమార్‌యాదవ్, రోహిణ్‌రెడ్డి తదితరులు.

జూబ్లీహిల్స్, జనవరి 12, ప్రభాతవార్తః ఈ నెల 14న ఖైరతాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పతంగుల పండుగకు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందన్ ఆహ్వానించారు. నియోజకవర్గంలోని ప్రసాద్ ఐమాక్స్ గ్రౌండ్స్‌లో ఈ పతంగుల పండుగను నిర్వహిస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పతంగుల పండుగకు తప్పకుండా వస్తానని సీఎం వారికి హామిచిన్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనీల్‌కుమార్ యాదవ్, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు ఖండిస్తూ శాంతియుత నిరసన

కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు

హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త: ఇటీవల మహిళా ఐఏఎస్ పై ప్రసారమైన అసత్య వార్తను తీవ్రంగా ఖండిస్తూ జిల్లా అధికారులు, ఉద్యోగులు ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో రెవిన్యూ అధికారులు, టీజీవో, టీఎన్జీవో, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తాసిల్దార్ల సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. లాంటి ఆధారాలు లేకుండా నిరాధారణ ఆరోపణలు చేస్తే సహించేది లేదని అసత్యప్రచారాన్ని ప్రచారం చేసిన సదరు టివిఛానల్‌పై చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇకపై జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కదిరవన్ పలనికి అందజేశారు. ఈ నిరసనలో టీజీవో జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియన్ అధ్యక్షులు రామకృష్ణ, తసిల్దార్ సంఘం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, కార్యదర్శులు ఆశన్న, విక్రమ్ కుమార్, జిల్లా అధికారులు సురేందర్, పవన్ కుమార్, కోటాజి, ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, రోహిణి, వందన, డాక్టర్ వెంకటి ఉద్యోగులు పాల్గొన్నారు.

నవరసభరితం ఏకం చతుర్భుజం కూచిపూడి నృత్యరూపకం

ఏకం చతుర్భుజం కూచిపూడి నృత్యరూపకంలో దృశ్యాలు

నాంపల్లి, జనవరి 12 ప్రభాతవార్త : శ్రీ నారాయణుడి చతుర్భుజ రూపం ద్వారా వ్యక్తమయ్యే సృష్టి ఏకత్వాన్ని (ఏకం) ప్రతిబింబిస్తూ శ్రీ హిరణ్మయి నృత్యాలయ 12 వార్షికోత్సవ వేడుకలలో భాగంగా డా. ప్రియాంక భార్దే చేతభావన రచన దర్శకత్వం, నృత్యదర్శకత్వంలో ఏకం చతుర్భుజం కూచిపూడి నృత్యరూపకం రసరమ్యం, నవరసభరితంగా ప్రదర్శింపబడింది. బషీర్‌బాగ్ లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ఈ ప్రదర్శన చతుర్విధ పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ, మోక్షాలను మానవ ఆలోచన, క్రియలకు మార్గనిర్దేశం చేసే శాశ్వత జీవితసూత్రాలుగా, శాస్త్రీయ సౌందర్యం, భారతీయ జ్ఞాన వ్యవస్థలలో పాతుకుపోయింది. పురుషార్థాల మధ్య సమతుల్యత జీవితంలో సామరస్యానికి ఎలా దారితీస్తుందో ఒక నిర్మాణాత్మక, భావోద్వేగభరితమైన అన్వేషణను ఏకం చతుర్భుజం అందించింది. సంప్రదాయ కూచిపూడి పదజాలం స్పష్టత, కచ్చితత్వం, ఔచిత్యంతో శాస్త్రీయ నృత్యభాష ద్వారా భారతదేశ సాంస్కృతిక, తాత్విక మూలాలు ప్రతీఒక్కరికీ సులువుగా అర్థమయ్యేరీతిలో ప్రదర్శింపబడిన ఈ నృత్యరూపకం సమకాలీన ప్రేక్షకులను, ముఖ్యంగా యువతను అమితంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖ గురువులు, పండితులు, కళాకారులు విచ్చేసి నృత్యరూపకంలో అద్భుత ప్రదర్శనిచ్చిన కళాకారులకు శుభాభినందనలు తెలిపారు.

చైనా మాంజాపై పోలీసుల ఉక్కుపాదం

-రూ. 1.68 కోట్ల విలువైన బాబిన్లు స్వాధీనం

-నెల రోజుల్లో 132 కేసులు ... 200 మంది అరెస్ట్

ఉప్పల్, జనవరి 12 ప్రభాతవార్త : హైదరాబాద్ నగరవ్యాప్తంగా చైనా మాంజాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పోలీసులు ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పలు చోట్ల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా చైనా మాంజాతో ప్రమాదాలు పెరిగిపోవడంతో పోలీసులు కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా గత నాలుగు రోజుల్లో రూ.43 లక్షల విలువైన 2, 150 బాబిన్లను హైదరాబాద్ పోలీసులు సీజ్ చేశారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పర్యావరణానికి, పక్షులకు, మనుషుల ప్రాణాలకు ముప్పు కలిగించే ఈ నిషేధిత మాంజాను విక్రయిస్తున్న వ్యవహారంలో పలువురిపై కేసులు నమోదు చేశారు. నగరంలో నాలుగు రోజుల్లో 29 కేసులు నమోదు చేసి.. 57 మందిని అరెస్ట్ చేసినట్లు సిపి సజ్జనార్ తెలిపారు. గత నెల రోజుల్లో సుమారు 132 కేసులు నమోదు చేసి రూ.1.68 కోట్ల విలువైన 8,376 బాబిన్లను స్వాధీనం చేసుకున్నట్లు సిపి సజ్జనార్ తెలిపారు. మొత్తంగా 200 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిషేధిత మాంజాను విక్రయించినా, కొనుగోలు చేసినా జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రజలు సురక్షితమైన దారానలే వాడుతూ, ఆనందంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని సిపి సూచించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం!

జూబ్లీహిల్స్, జనవరి 12, ప్రభాతవార్తః బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి ఓ వివాహితను దారుణంగా హత్య చేశారు. వివాహేతర సంబంధమే ఇందుకు కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని కార్ఖానా ప్రాంతంలో నివసించే మహిళ(27)కు వివాహం జరిగి ఇద్దరు పిల్లలున్నారు. ఆమె భర్త కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బేగంపేటలోని ఒక పబ్‌లో డ్యాన్సర్‌గా పనిచేసే సమయంలో మహిళకు జహీరుద్దీన్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండేది. ఇటీవల ఆమె పబ్ నుంచి మరో ప్రాంతంలో ఉన్న పబ్‌కు మారింది. దీనికితోడు జహీరుద్దీన్‌కు సైతం దూరంగా ఉంటుంది. ఈ క్రమంలోనే అనుమానం, కక్ష పెంచుకున్న జహీరుద్దీన్ ఆదివారం రాత్రి ఆమెతో మాట్లాడాలని నమ్మించి ద్విచక్రవాహనంపై ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం ప్రాంగణంలోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెతో గొడవ పడ్డాడు. మాటమాట పెరగడంతో తన వద్ద ఉన్న కత్తి తీసి ఆమెను విచక్షణారహితంగా పొడిచి హత్య చేశాడు. అనంతరం పక్కనే ఉన్న గ్రానైట్ రాయిని ఎత్తి ఆమె ముఖాన్ని చిద్రం చేశాడు. కసి తీరా చంపిన అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరకున్నారు. వివాహేతర సంబంధమే ఆమె ప్రాణాలు తీసి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా స్పష్టం చేశారు. మరోవైపు నిందితుడిని అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. హత్య కేసు నమోదు చేసి బోరబండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుడి ముసుగులో ఐటీ ఉద్యోగికి రూ.20 లక్షలు టోకరా

జూబ్లీహిల్స్, జనవరి 12, ప్రభాతవార్తః భక్తుడిగా పరిచయం పెంచుకొని ఒక ఐటీ ఉద్యోగిని రూ.20 లక్షలు మోసం చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బాల గణేష్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఐటీ రంగంలో పనిచేస్తుండగా, గత 13 సంవత్సరాలుగా హరే కృష్ణ (ఇస్కాన్)తో అనుబంధం కలిగి హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో అన్నదాన సేవల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో 2019లో వర్ధినీడి సత్య వెంకట రెడ్డి నాయుడు అనే వ్యక్తితో అతనికి పరిచయమైంది. తనను ఆధ్యాత్మిక భక్తుడిగా పరిచయం చేసుకొని బాలగణేష్‌ను నమ్మించాడు. సిద్దిపేట జిల్లా నర్సాపూర్ గ్రామంలో 10 ఎకరాల భూమి కొనుగోలు చేస్తున్నానని, పెట్టుబడి పెడితే భూమి రిజిస్ట్రేషన్‌తో పాటు సురక్షిత లాభాలు ఉంటాయని చెప్పి నిందితుడు డబ్బు పెట్టించాలని ప్రలోభపెట్టాడు. అతని మాటలు నమ్మిన బాధితుడు బ్యాంక్‌లో రుణం తీసుకొని మరీ రూ.20 లక్షల రుణం తీసుకొని సత్యవెంకటరెడ్డి నాయుడు ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశాడు. డబ్బు తీసుకున్న అనంతరం అతను ప్రామిసరీ నోట్ రాసిచ్చి, భూమికి సంబంధించిన పత్రాలుగా చెప్పబడిన డాక్యుమెంట్లు చూపించి నమ్మించాడు. ఇప్పటివరకు భూమి రిజిస్ట్రేషన్ చేయకపోగా, డబ్బు కూడా తిరిగి చెల్లించలేదని బాధితుడు ఆరోపించాడు. అనంతరం నిందితుడు తన చిరునామా మార్చుకుంటూ ఫోన్‌లకు స్పందించకుండా పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాధితుడు బాలగణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోల్నాకలో సంక్రాంతి సంబరాలు..

గోల్నాకలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న పిసిసి మాజీ కార్యదర్శి లక్పతి యాదగిరిగౌడ్,జ్యోతి దంపతులు

హైదరాబాద్, జనవరి 12 ప్రభాతవార్త

టిపిసిసి మాజీ కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్పతి యాదగిరిగౌడ్, నల్లకుంట డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎ.జ్యోతి యాదగిరిగౌడ్ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం గోల్నాక కూరగాయల మార్కెట్‌లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి అందరికీ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లక్పతి యాదగిరిగౌడ్ మాట్లాడుతూ నగర ప్రజలకు ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలన్నారు. సంక్రాంతి సందర్భంగా గాలిపటాలు ఎగరేసేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చైనా మాంజాను ఎవరు కొనవద్దని, చైనా మాంజా వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. పిల్లలను మరి ముఖ్యంగా తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని,ఎట్టి పరిస్థితుల్లో చైనా మాంజాను వాడరాదని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎ.జ్యోతి యాదగిరిగౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోటం అనిల్‌కుమార్, గడ్డం శ్రీధర్‌గౌడ్, సాయికిరణ్, మల్లేష్, పృద్వి, ఎంపీ రాజశేఖర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

- జెడ్సి సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి

ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

చాంద్రాయణగుట్ట, జనవరి 12, ప్రభాతవార్త : సమస్యల పరిష్కారానికై ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్సి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంతోష్‌నగర్, యాకుత్‌పురా, చార్మినార్, మలక్‌పేట్, మూసారంబాగ్ సర్కిళ్లలోని ప్రజలు డ్రైనేజీ, రోడ్లు, అక్రమ నిర్మాణాలు, వీధి దీపాలు, వీధి కుక్కలు, క్రీడా మైదానాలు, పార్కులు, దోమలు తదితర సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. సంతోష్‌నగర్ సర్కిల్ నుండి ఒకటి, చార్మినార్ సర్కిల్ నుండి ఒకటి చొప్పున రెండు ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో వెటర్నీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యుబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజా, ఎంఎసి రాజారావు పాల్గొన్నారు.

స్వచ్ఛతను కాపాడటం అందరి బాధ్యత

గుట్టలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీసీ సురేందర్, అధికారులు

చాంద్రాయణగుట్ట, జనవరి 12, ప్రభాతవార్త : పారిశుధ్య పనుల ప్రత్యేక నిర్వాహణలో భాగంగా చాంద్రాయణగుట్ట సర్కిల్లోని పలు ప్రాంతాలలో జీహెచ్ఎంసి అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సోమవారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి.సురేందర్, ఎస్‌డబ్ల్యూఎం డిఇ భాను ప్రతాప్, ఎఇ అర్జ, ఎస్ఎఫ్ఎ మహ్మద్ మహమూద్ వాహిదుద్దీన్‌లు సర్కిల్లోని పలు ప్రాంతాలలో పర్యటించి రోడ్లు, చెత్తకుండీలు, మైదానాలు, పార్కులు, ఆర్వోబీలపై చెత్త చెదారం, మట్టికుప్పలను తొలగించారు. ఆ ప్రాంతాలను పరిశుభ్రం చేసి అందమైన ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా డీసీ సురేందర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాలలోని చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని కోరారు. వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చెత్తకుండీలలో వేయాలని సూచించారు. సర్కిల్‌లో స్వచ్ఛతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని, అది బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు.

వివేకానందుడు ఆదర్శప్రాయుడు

పురస్కారాలను ప్రధానం చేస్తున్న పూర్వ డిజిపి డాక్టర్ సి.ఎన్.గోపినాథ్ రెడ్డి

చిక్కడపల్లి జనవరి 12 (ప్రభాతవార్త) :

భారతీయ యువతను అద్భుతంగా ప్రభావితం చేసిన స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని పూర్వ డిజిపి డాక్టర్ సి.ఎన్.గోపినాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా వెంకట దీక్షితులు కళావేదిక నందు శ్రీస్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్వామి వివేకానంద జీవితచరిత్ర పై కవిసమ్మేళనం , అవార్డు ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా ముఖ్య అతిథులచే జ్యోతి ప్రజ్వల చేశారు. అనంతరం స్వామి వివేకానంద స్ఫూర్తి అవార్డు గ్రహీతలు ఉన్నం వెంకటేశ్వర్లు, కుండా భాస్కర్, ఎస్.రామచంద్ర రావు, ఆలియా భాను, డాక్టర్ వై.శ్రీనివాస బాబు, డాక్టర్ ఆమంచ అంజయ్య, దుబ్బా భాస్కర్, ఎల్.అనురుద్ర రెడ్డి, ఎమ్.ఎస్.కె.షా, బత్తిన నరసింహులు గౌడ్, ఎమ్.డి.శ్రీనివాస్ లను ఘనంగా అవార్డుతో సత్కరించారు. ఈకార్యక్రమంలో సేవారత్న డాక్టర్ మునగా రామ మోహనరావు, విశ్రాంత రెవిన్యూ అధికారి ముద్దపాటి సూర్య నారాయణ, సేవారత్న వడ్లకొండ వెంకట్రావు, మేడిది వెంకట సుబ్బయ్య ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ మేడిది వెంకటేశ్వరరావు, కనకదుర్గ నృత్య విభావరి డైరెక్టర్ లయన్ నిర్మలా ప్రభాకర్, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధ కుసుమ, అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి.

జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా ఉప్పుగూడ మంగళముఖి హనుమాన్ దేవాలయం వద్ద స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు, కార్యకర్తలు

స్వామి వివేకానందకు నివాళులు అర్పిస్తున్న గణేష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు చింతకుంట వెంకటేశ్‌యాదవ్ తదితరులు

వివేకానందుడి 163వ జయంతిని పురస్కరించుకొని ఫిల్మ్‌నగర్ స్వామి వివేకానందనగర్ కూడలిలో నిర్వహించిన వేడుకల్లో ఫిల్మ్‌నగర్ 18 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు, స్తానిక నేతలు బోయ సాయిలు, ఆకుల రాజు, సాయిలు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్, బోయ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మజీదుకొండ డివిజన్ ఆల్మాపూర్ టౌన్‌షిప్‌లో వివేకుడి జయంతి వేడుకలను జరుపుకుంటున్న ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ అధ్యక్షులు వంశీ, ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, శంకరిదేవ్, శశిధర్‌రెడ్డి, సంతోష్, పవన్, కృష్ణారెడ్డి తదితరులు.

సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సమాఖ్య నాయకులు

కిన్మత్‌పూర్‌లో వివేకానంద జయంతి వేడుకల సందర్భంగా రక్తదానం చేసిన యువకులకు భగవద్గీత, సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రముఖ న్యాయవాది మానిక, స్వామిగౌడ్, భీమార్జున్‌రెడ్డి, మహాలింగంగౌడ్, సీరుడు శేఖర్ ముదిరాజ్ తదితరుల దృశ్యం.

నార్సింగి సర్కిల్ పరిధిలో జాతీయ యువజన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బిజెపి నేతలు రాజ్‌భూపాల్‌గౌడ్, మెండె నాగేష్, లక్ష్మీనారాయణ, బిక్షపతి, జైపాల్‌రెడ్డి తదితరుల దృశ్యం

వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్దాలక్ష్మినాథ్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో జరిగిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొని వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

స్వామి వివేకానంద సేవలు చిరస్మరణీయం

తలసాని 24గంటల్లో ముఖ్యమంత్రికి క్షమాపణ చెప్పాలి : కోట నీలిమ

తలసానిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

బేగంపేట జనవరి 12,ప్రభాతవార్త

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇకనైనా అహంకార పూరిత వ్యాఖ్యలు మానుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై 24గంటల్లో క్షమాపణ చెప్పకుంటే గల్లీ గల్లీలో తలసానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు పీసీసీ వైస్ ప్రెశిడెంట్ ,సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ హెచ్చరించారు.సోమవారం సాయంత్రం బేగంపేట పోలీసుస్టేషన్ వద్ద కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రధాన రోడ్డుపై బైఠాయించి తలసాని దిష్టిబొమ్మ దగ్గం చేసి రాస్తారోకో నిర్వహించారు. తలసానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.గతంలో కూడా తలసాని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై స్థాయి మరచి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఆమె ఆరోపించారు.ఆయన రానున్న 24గంటల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి యావత్ తెలంగాణా ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. తలసాని తో క్షమాపణ చెప్పిస్తామని పోలీసుల నుంచి హామీ వచ్చాకే రాస్తారోకో నిలిపివేసామన్నారు.ప్రజలకు విభజన నచ్చిందని,తలసానికి ఎందుకు నచ్చడంలేదని ఆమె ప్రశ్నించారు.డీలిమిటేషన్ తో బీఆర్ఎస్ పార్టీ ఉనికి గందర గోళంగా మారిందన్నారు.అయినా ఆయనకు అంతగా నరకాలి ముక్కలు ముక్కలుగా చేయాలని ఉంటే మోండా మార్కెట్‌కు వెళ్లి ఆలుగడ్డలు,కూరగాయలు తెచ్చుకుని ముక్కలు చేసుకుని తిని ఇంట్లో ఉండాలన్నారు.అభివృద్ధి,పరిపాలనా సౌలభ్యం కోసం జీహెచ్ఎంసీ ని ప్రభుత్వం మూడు కార్పోరేషన్లుగా ఏర్పాటు చేసిందని కోట నీలిమ తెలియజేసారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన తెల్పుతున్న కోట నీలిమ.

పారిశుధ్య నిర్వాహణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జోనల్ కమిషనర్ హేమంత్

-శానిటేషన్‌పై సమీక్షా సమావేశంలో అధికారులకు జడ్సి ఆదేశాలు

శేరిలింగంపల్లి,జనవరి 12 ప్రభాతవార్త

పారిశుద్య నిర్వాహణపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని,అపరిశుభ్రత కనిపిస్తే సహించేది లేదని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ శానిటేషన్ అదికారులకు హెచ్చరించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం పారిశుద్య నిర్వాహణా తీరుతెన్నులపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారులు,కాలనీ అంతర్గత రహదారులు,వీధుల్లో పేరుకుపోతున్నచెత్తా, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ రహదారులను పరిశుభ్రతకు అద్దం పట్టేవిధంగా తీర్చిదిద్దాలని జోనల్ కమిషనర్ హేమంత్ సూచించారు. కాలనీల్లోని రోడ్డుపై పయనించే వాహనదారులు, పాదచారులు ముక్కుమూసుకుని వెళ్లే పరిస్థితులనుంచి పరిశుభ్రతను చూసి ముక్కున వేలేసుకు నేంతలా శుభ్రత ఉండాలన్నారు. అందుకు క్షేత్రస్థాయిలో చేపట్టే పారిశుద్య చర్యలు అత్యంత ప్రధానమని సూచించారు. ప్రధానంగా శేరిలింగంపల్లి జోన్ పరిదిలో పరిశుభ్రత చర్యలను ఏవిధంగా చేయాలో వెల్లడించారు. ఐటీ పరిశ్రమలకు వేదికగా ఉన్నందున శేరిలింగంపల్లి జోన్‌లో ఆ స్థాయిలోనే రహదారుల నిర్వాహణ జరగాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది చేపట్టే చర్యలు కీలకమన్నారు. స్వీపింగ్ అనంతరం చెత్తకుప్పలు తొలగించాలని, ఫ్లైఓవర్‌లపై మట్టి,ఇసుక ఇతర వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. డీసీ స్థాయి నుంచి కిందిస్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పారిశుద్య పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని, లోటుపాట్లను సవరించుకుంటూ చర్యని పరిసరాలు వెల్లివెరిసేలా చూడాలన్నారు. ప్రతి షాపు,కమర్షియల్ ఏరియా, దుకాణాలలో డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని, అందుకు గాను ఈనెల 15వ తేది వరకు అఖరితేదిగా పరిగణించాలన్నారు. లేనిపక్షంలో ఫెనాల్టీపడుతుందని దుకాణదారులకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా సర్కిళ్ల డిప్యూటి కమిషనర్లు ప్రశాంతి,శశిరేఖ, సురేశ్,కృష్ణ, ప్రదీప్,ఆయా విభాగాల అధికారులు, డీలు ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు,రాంకీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్య నిర్వాహణపై సమీక్షా సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ హేమంత్, అధికారులు

యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి : సముద్రాల వేణుగోపాలాచారి

చిక్కడపల్లి జనవరి 12 (ప్రభాతవార్త): తెలుగు జాతీయ సారస్వత పరిషత్, ఆది లీల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గాన సభలో జరిగిన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువకవి సమ్మేళనం మరియు వివేకానంద స్ఫూర్తి అవార్డుల ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాంస్కృతిక బంధువు మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ నేటి యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లి ఉండాలని స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తినిచ్చిన మాటలు చెప్పారు. మరో విశిష్ట అతిథి తెలంగాణా భూ స్వాధీన కోర్ట్ న్యాయమూర్తి నర్సి రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద అడిగినట్లుగా నాకు వందమంది యువతను ఇవ్వండి ఈ దేశాన్ని అభివృద్ధి మార్గంలో పెడతాను అన్నారు బుద్ధిబలంతో పాటు శారీరక బలం దృఢంగా కలిగి ఉంటే దేశ ప్రగతి కి ఇవి సోపానాలు, ఆత్మీయ అతిథిగా విచ్చేసిన మాజీ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వ కలాభరణం కృష్ణమోహన్, . జాతీయ తెలుగు సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ రాంప్రసాద్, న్యూ ఢిల్లీ కి చెందిన ఆది లీల ఫౌండేషన్ చైర్మన్ ఆదినారాయణ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ తెలంగాణ విభాగపు అధ్యక్షులు కలిదిండి విశ్వనాథరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రహాస్ ఇప్పలపల్లి, లక్ష సాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞా రాజు, తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు పి బడేసాబ్, శ్రీ రామకృష్ణ చంద్రమోళి తదితరులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

తెలుగు జాతీయ సారస్వత పరిషత్, ఆది లీల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గాన సభలో పురస్కారాలను ప్రధానం చేస్తున్న మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి

ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారం : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, జనవరి 10 ప్రభాతవార్తః కాలనీలోని ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత కమిటీ సభ్యుల పైనే ఉందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం బన్సీలాల్ పేట డివిజన్ లోని పొట్టి శ్రీరాములు నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలో ఆయన అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలువురు మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి నీటి సరఫరా జరగడం లేదని, త్రాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ప్రశ్నించారు. నగరానికి నీటి సరఫరా జరిగే పైప్ లైన్ మరమ్మతులు జరుగుతున్నాయని వాటర్ వర్క్స్ జీఎం వినోద్ వివరించారు. మరమ్మతులు పూర్తి అయ్యే వరకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజల అవసరాలు తీర్చాలని ఆదేశించారు. అదే విధంగా లిఫ్ట్ కూడా పనిచేయడం లేదని, వృద్ధులు, వికలాంగులు మెట్ల పై నుండి రాకపోకలు సాగించడం కష్టతరంగా ఉందని వివరించగా, వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ ప్రజల సమస్యల పరిష్కారం, నిర్వహణ కోసం 6 గురు సభ్యులతో కమిటీని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు కార్పొరేటర్ హేమలత ఇతర నేతలు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మెట్రో రైల్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ జె.ఎన్.గుప్తా మృతి

హైదరాబాద్, జనవరి 12 ప్రభాతవార్త : హైదరాబాద్ మెట్రో రైల్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (రైల్వేస్) జె.ఎన్. గుప్తా సోమవారం బెంగళూరులో గుండెపోటుతో కన్నుమూశారు. 2018 నుండి హెచ్ఎంఆర్ఎల్‌లో పని చేస్తున్న గుప్తా, తన విలువైన సేవలు, సాంకేతిక నైపుణ్యం, అంకితభావంతో సంస్థకు, ప్రజా రవాణా రంగానికి విశేషమైన సేవలు అందించారు. గుప్తా మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎస్వీఎస్‌రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డి.వి.ఎస్.రాజు, ఇతర సీనియర్ అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో ఆయన లేని లోటును కుటుంబ సభ్యులు భరించే ధైర్యం, శక్తి ఇవ్వాలని ప్రార్థిస్తున్నట్టు ఈ సందర్భంగా సర్ఫరాజ్ అహ్మద్ పేర్కొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఘనంగా అస్మిత యోగాసనాలు

-పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు

నాచారం, జనవరి 12 ప్రభాతవార్త : అస్మిత యోగాసనాలు - 2025-26 (సౌత్ జోన్) రెండవ రోజు కార్యక్రమాలు నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన డీపీఎస్ చైర్మన్, యోగాసనా భారత్ కార్యదర్శి నందనం కృపాకర్‌కు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డీపీఎస్ చైర్మన్, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో యోగా ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందిందన్నారు. యోగాను చదువులో భాగంగా తీసుకుంటే విద్యార్థులు ఆసియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా యోగాను ఒక ఉపాధిగా కూడా మలచుకోవచ్చని తెలిపారు.2075 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే ఐదవ స్థానంలో నిలపాలనే ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షలో భాగంగానే ఈ తరహా యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ముఖ్యఅతిథి ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ.. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కొమరయ్యను ప్రత్యేకంగా అభినందించారు. యోగా ఒక శాస్త్రమని, ఆరోగ్యాన్ని చక్కగా కాపాడుతుందని అన్నారు. స్వామి వివేకానంద 164వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాలు జరగటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం యోగా విదేశాల్లో కూడా విస్తృతంగా వ్యాప్తి చెందిందని, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అనేక మంది యోగాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. సౌత్ జోన్ యోగాసన పోటీలు తన స్నేహితుడి పాఠశాలలో నిర్వహించటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ముత్యాల నగరం హైదరాబాద్ అంటేనే బిర్యానీ గుర్తుకు వస్తుందని సరదాగా వ్యాఖ్యానించారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేసిన మేకల సారంగపాణి

సికింద్రాబాద్, జనవరి 10 ప్రభాతవార్తః బీజేపీ సీతాఫల్ మండి డివిజన్ నేతల ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా బీదలబస్తీ గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలలో మహాశక్తివంతమైన కలలు చాటుకునే పెద్ద పండుగ సంక్రాంతి ముగ్గుల పండుగని ఎంతో చక్కగా ముగ్గులు వేసి వారి ప్రతిభను చాటుకున్నారని మహిళలు అని రంగాల్లో ముందుకు పోవాలని మేకల సారంగపాణి కోరారు. ముగ్గుల పోటీలోనే కాకుండా కేంద్ర మంత్రి వర్యులు కిషన్ రెడ్డి గారు నిర్వహిస్తున్న ఖెలో ఇండియా జీతో ఇండియాలో అందరూ భాగస్వాములు కావాలని మేకల సారంగపాణి కోరారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్ష కిరణ్, రాచమల్ల కృష్ణమూర్తి, కనికట్ల హరి, అజయ్ నాయుడు, ముఠాగణేష్, శోభారాణి, నాగరాణి, శైలజ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అడిక్ మెట్ డివిజన్‌లో స్వామివివేకానంద జయంతి సభ

అడిక్ మెట్ డివిజన్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం స్వామివివేకానంద 163 వ జయంతి కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి జనవరి 12 (ప్రభాతవార్త) : అడిక్ మెట్ డివిజన్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం స్వామివివేకానంద 163 వ జయంతి కార్యక్రమం జరిగింది. స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిని, ముందుకు తీసుకొనివెళ్లాలని కొనియాడారు.ఈ కారిక్రమంలో పాల్గొన రాష్ట్ర నాయకులు, నగర నాయకులు, డివిజన్ నాయకులు, అందరికి పెరు పెరున ధన్యవాదములు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,జనవరి 12 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వి నియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సోమవారం పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 17 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ తహశీల్దార్ పాండు నాయక్ పాల్గొన్నారు.

నిమ్స్‌లో రక్తదాన శిబిరం

జూబ్లీహిల్స్, జనవరి 12, ప్రభాతవార్తః స్వామి వివేకానంద గారి జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పంజాగుట్టలోని నిమ్స్ బ్లడ్ బ్యాం

పేదల పెన్నిది అందరికీ ఆదర్శప్రాయుడు పిజెఆర్

నర్సీయ పీజేఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి.

యూసుఫ్‌గూడ జనవరి 12, ప్రభాతవార్త : పేదల పెన్నిది అన్ని బస్తీల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయిన ప్రజా నాయకుడు దివంగత ఎమ్మెల్యే పి.జనార్ధన్‌రెడ్డి అని ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. పీజేఆర్ జయంతిని పురస్కరించుకుని వెంగళ్‌రావునగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పీజేఈఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజేఆర్ కార్మిక నాయకుడిగా పేదల పెన్నిది ఆయన చూపిన బాటలోనే నాయకుల, కార్యకర్తలు నడవాలనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది అన్వర్ ఖాన్, హైకోర్టు న్యాయవాది లక్ష్మికాంతరావు, అశోక్, ప్రదీప్‌కుమార్, నాగరాజు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ట్వీన్స్.. చదరంగంలో క్యాండిడేట్ మాస్టర్స్

క్యాండిడేట్ మాస్టర్స్‌గా నిలిచిన ఆమయ అగర్వాల్, అనయ్ అగర్వాల్.

జూబ్లీహిల్స్, జనవరి 12, ప్రభాతవార్త: నగరానికి చెందిన సూపర్ ట్వీన్స్ చదరంగం క్రీడా చరిత్రలో క్యాండిడేట్ మాస్టర్స్ టైటిల్‌ను గెలిచి ప్రత్యేక గుర్తింపును సాధించారు. 10 ఏళ్ల వయసున్న ఆమయ అగర్వాల్ ఉమెన్స్ క్యాండిడేట్ మాస్టర్‌గా, అనయ్ అగర్వాల్ క్యాండిడేట్ మాస్టర్‌గా నిలిచారు. కాగా వీరిద్దరిని సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఏకాగ్ర చెస్ అకాడమీ కేంద్రంలో అకాడమీ చీఫ్ కోచ్ చైతన్య, కోచ్ రాజు సూపర్ ట్వీన్స్‌ను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యూరప్‌లోని సెర్బియా, గ్రీస్‌లలో జరిగిన ఇంటర్నేషనల్ యూరోపియన్ చెస్ క్లబ్ టోర్నమెంట్స్‌లో ఇంటర్నేషనల్ మాస్టర్స్‌తోపాటు హేమాహేమీలతో తలపడి వారిని ఓడించి టాప్‌లో నిలిచి క్యాండిడేట్ మాస్టర్స్‌గా నిలిచామన్నారు. వరల్డ్ నెంబర్ వన్‌గా నిలవడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. తమ విజయాల వెనుక తల్లిదండ్రుల, కోచ్, ఇండస్ స్కూల్ యాజమాన్యం కృషి ఎంతగానో ఉందన్నాఉ. కోచ్‌లు నుండి నేర్చుకున్న అంశాలు, వారి పట్టుదలే సూపర్ ట్వీన్స్ చెస్‌లో క్యాండిడేట్ మాస్టర్స్‌గా నిలిచేలా చేశాయని తల్లి పనాషా అగర్వాల్ తెలిపారు. కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే సూపర్ ట్వీన్స్‌లోని ఆశేషమైన ప్రతిభ, సృజనాత్మకత ఆలోచనలు, ఓర్పు, పట్టుదలే వారిని ఇంటర్నేషనల్ క్యాండిడేట్ మాస్టర్స్‌గా నిలిచేలా చేశాయని చీఫ్ కోచ్ చైతన్య తెలిపారు. ట్వీన్స్ క్యాండిడేట్ మాస్టర్స్ గెలడవం చెస్ చరిత్రలో ఇదే తొలిసారన్నారు.

'వెలివాడ తొలిపొద్దు రమాబాయి వెల్ఫేర్ అసోసియేషన్' ఆవిర్భావం

రమాబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రోకా పద్మ, అనురాధ, లలిత తదితరులు

సైఫాబాద్, జనవరి 12 ప్రభాతవార్త: కేవలం మహిళల అభివృద్ధి, సంక్షేమ కోసమే 'వెలివాడ తొలిపొద్దు రమాబాయి మహిళా వెల్ఫేర్ అసోసియేషన్' ఆవిర్భావం చేపట్టడం జరిగిందని అసోసియేషన్ న్యాయ సలహాదారు, ప్రముఖ న్యాయవాది రోకా పద్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోట్టు అనురాధ, మూలె లలిత చెప్పారు. సోమవారం వీర్‌నగర్‌లో మహిళా సంఘం ప్రతినిధులు, బస్తీ పెద్దలు, ప్రజలు సమావేశమై గతంలో ఉన్న జైభీం మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ పేరును వెలివాడ తొలిపొద్దు రమాబాయి మహిళా వెల్ఫేర్ అసోసియేషన్‌గా మార్చడం జరిగిందన్నారు. ఇక నుంచి సేవా కార్యక్రమాలన్ని ఈ అసోసియేషన్ పేరుమీద నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో తాము ఆనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, భవిష్యత్తులో కూడా రమాబాయి పేరుమీద ప్రతి ఏడాది జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్‌కు అన్ని విధాలుగా రమాబాయి అండగా నిలిచారని, పేదల కోసం ఎంతో కృషి చేశారని ఆమె సేవలు మరిచిపోలేమని, అందుకే ఆమె పేరుమీద ఈ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం - డిఇ రమేష్ చంద్ర

గృహజ్యోతి లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పంపిన శుభాకాంక్షల లేఖను అందజేస్తున్న అధికారులు.

నార్సింగి, జనవరి 12 ప్రభాతవార్త : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రేయింబవళ్లూ కష్టపడుతున్నామని ఇబ్రహీంభాగ్ డిఇ రవిచంద్ర పేర్కొన్నారు. నార్సింగి సర్కిల్ పరిధిలోని నెక్‌నాంపూర్ డివిజన్‌లో గృహజ్యోతి వినియోగదారులైన జయప్రకాశ్, కళమ్మ, అనిత తదితరులకు డిప్యూటీ సీఏం భట్టి విక్రమార్క పంపించిన శుభాకాంక్షల లేఖను ఏఈ మణికంఠతో కలిసి డిఇ రవిచంద్ర అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పతకంను అర్హులందరికి వర్తింపచేస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి కరెంటును వాడుతున్న వినియోగదారుల పేర్లపై శుభాకాంక్షలు అందించడంతో వారు సంతోషానందాలకు గురవుతున్నారని తెలిపారు. 200.యూనిట్ల లోపు కరెంటు వాడే పేదలకు ఈ గృహజ్యోతి పతకంను అందజేస్తున్నామని వివరించారు. వినియోగదారులు-అధికారుల మధ్య మరింత సాన్నిహిత్యం పెరిగేందుకు ఈ కార్యక్రమం ఉపకరిస్తుందని భావిస్తున్నామన్నారు. ప్రజలు తమ ప్రాంతాలలో ఏ విధమైన కరెంటు కష్టాలు వచ్చినా వెంటనే స్థానిక ఏఈల దృష్టికి తీసుకెళ్లాలని, వారు స్పందించకపోతే నేరుగా నన్ను సంప్రదించవచ్చని డిఇ వివరించారు. గృహజ్యోతి లబ్దిదారులంతా ఉచిత కరెంటుతో తమకు నెల నెలా రూ.500-1000.వరకు డబ్బులు ఆదా అవుతున్నాయని ఆనంద పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 52,82,498.మంది గృహజ్యోతి, 30,03,813.మంది అన్నదాతలు ఉచిత విద్యుత్‌ను వాడుతున్నారని వివరించారు.

అంతర్జాతీయ పోటీల్లో హైదరాబాద్ సెయిలర్ల సత్తా

-ఒకేటోర్నీలో 4పతకాలు సాధించి సరికొత్త రికార్డు

-కాంస్య పతకంతో ప్రత్యేక ఆకర్షణగా 14ఏళ్ల రవికుమార్

హైదరాబాద్, జనవరి 12,ప్రభాతవార్త: చెన్నై వేదికగా జరిగిన అంతర్జాతీయ సెయిలింగ్ రెగట్టాలో హైదరాబాద్‌కు చెందిన యువ సెయిలర్లు అద్భుత విజయాలను నమోదు చేశారు. 7 దేశాల నుంచి 48 మంది అగ్రశ్రేణి సెయిలర్లు పాల్గొన్న ఈ పోటీలో నగర క్రీడాకారులు ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించి అంతర్జాతీయ స్థాయిలో భారత్ గర్వపడేలా చేశారు. ఒకే పోటీలో హైదరాబాద్‌కు 4 పతకాలు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. అలలతో పోరాడి.. పతకం నెగ్గిన 14ఏళ్ల రవి కుమార్ ఈ పోటీలో ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. కేవలం 34 కిలోల బరువుతో, శారీరకంగా అందరికంటే చిన్నవాడైన రవి, సముద్రంలో 2 మీటర్ల ఎత్తున ఎగిసిపడుతున్న అలలను, గంటకు 1520 నాట్ల వేగంతో వీస్తున్న గాలులను లెక్కచేయకుండా పడవను నడిపాడు. స్వీడన్, ఐర్లాండ్, మలేషియా వంటి దేశాల సెయిలర్లతో పోటీపడుతూ, చివరి రేసులో అద్భుత ప్రదర్శనతో అండర్15 బాలుర విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు.సామాన్య నేపథ్యం నుంచి అసామాన్య విజయం వైపురవి కుమార్ నేపథ్యం ఎందరికో స్ఫూర్తిదాయకం.అతని తండ్రి భీమేష్ ఒక నిర్మాణ కార్మికుడు కాగా, తల్లి మహేశ్వరి గృహ కార్మికురాలు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట నుంచి వలస వచ్చిన ఈ కుటుంబం, ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని పారడైజ్ సమీపంలో ఒక భవనానికి వాచ్‌మెన్లుగా ఉంటూ నివసిస్తున్నారు. ఉద్భవ్ స్కూల్‌లో చదువుతున్న రవి, ది యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కోచ్ సుహైమ్

పోటీలో గెలుపొందిన హైదరాబాద్ సెయిలర్లు

షేక్ శిక్షణలో ఈ స్థాయికి ఎదిగాడు. "మా రవి 14 ఏళ్లకే 6 దేశాలు తిరిగాడు, అంతర్జాతీయ పతకం సాధించాడు. మా లాంటి వారికి ఇది కలలో కూడా ఊహించని జీవితం," అని రవి తండ్రి భీమేష్ ఆనందం వ్యక్తం చేశారు. మణిదీప్‌కు స్వర్ణం శృంగారి, గోవర్ధన్‌లకు రజతాలు రసూల్‌పురాకు చెందిన నిర్మాణ కార్మికుని కుమారుడైన మణిదీప్ పేర్కట్ల , అండర్18 బాలుర విభాగంలో అద్భుత ప్రతిభతో స్వర్ణ పతకం సాధించాడు. గతంలో యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (వైసీహెచ్)లో శిక్షణ పొందిన ఇతను, ప్రస్తుతం మైసూర్‌లోని ఆర్మీ స్కూల్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. సికింద్రాబాద్ క్లబ్‌కు చెందిన సెయిలర్ శృంగారి రాయ్ బాలికల విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఐర్లాండ్ క్రీడాకారిణికి గట్టి పోటీ ఇచ్చిన ఆమె, స్వల్ప పాయింట్ల తేడాతో రజత పతకం గెలుచుకుంది. స్కిఫ్ క్లాస్ విభాగంలో యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన గోవర్ధన్ పల్లారా రజత పతకం సాధించాడు.ఈ విజయాలతో హైదరాబాద్ సెయిలింగ్ కీర్తి అంతర్జాతీయ స్థాయికి చేరిందని కోచ్ సుహీమ్ షేక్ అన్నారు. ఈ నలుగురు విజేతలు ఏప్రిల్‌లో చైనాలోని సాన్యాలో జరగబోయే ఆసియా బీచ్ గేమ్స్‌లో భారత్ తరపున పాల్గొననున్నారు.

16న టిటిడి శ్రీవారి దేవాలయంలో శ్రీగోదాదేవి అమ్మవారి కళ్యాణమహోత్సం

సైఫాబాద్, జనవరి 12 ప్రభాతవార్త: దనుర్మాసం ముగింపు సందర్భంగా ఈ నెల 16వ తేదీన లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీగోదాదేవి అమ్మవారి కళ్యాణమహోత్సవ ఘనంగా నిర్వహిస్తున్నామని టిటిడి ప్రత్యేక అధికారి యు.రమేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి కళ్యాణ మహోత్సవం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణతో పాటు అన్నదానం కూడా ఉంటుందన్నారు.

కనుల పండువగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సం

కోకాపేట్ డివిజన్ గౌలిదొడ్డిలో శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయం 67.వ, వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న పురప్రముఖుల దృశ్యం.

నార్సింగి, జనవరి 12 ప్రభాతవార్త : కోకాపేట్ డివిజన్ గౌలిదొడ్డిలో ఉన్న శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయం 67.వ,వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. నార్సింగి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి, పుర ప్రముఖులు యాదయ్య, కృష్ణ, నాగేష్ యాదవ్, బిక్షపతి, బాలకృష్ణ, మల్లేష్ యాదవ్, బాల్‌రామ్, నర్సింగ్‌రావ్, శ్రీనివాస్, బాబయ్య తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కొలిచిన వారికి కొంగు బంగారంగా ఉన్న అమ్మవారికి ఏటేటా భక్తజనం పెరుగుతుందని పుర ప్రముఖులు తెలిపారు. మహిమాన్విత అమ్మవారి దేవాలయంను ఆధునీకరించేందుకు దాతలు పెద్ద ఎత్తున ముందుకు రావాల్సిన అవసరం ఉందని భక్తులు పేర్కొన్నారు.

మణికొండలో రెడ్డి ఫౌండేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న సభ్యుల దృశ్యం.

నార్సింగి, జనవరి 12 ప్రభాతవార్త : మణికొండ డివిజన్ పరిధిలోని పంచవటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రెడ్డి ఫౌండేషన్-2026.క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నేత బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, బాలరెడ్డి, శివారెడ్డి, సంఘం అధ్యక్షులు నరేందర్‌రెడ్డిలు నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయం చాలా విలువైందని, సమయంను సద్వినియోగం చేసుకున్న వారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. గడిచిన ఏ ఒక్క క్షణంను కూడా మనం తిరిగి తీసుకు రాలేమని, ఇక నుంచైనా సమయంను వృధా చేయకుండా కుటుంబం, సమాజం, ధర్మం, దేశం ఎదుగుదలకు ఉపయోగించాలని సూచించారు. మణికొండ రెడ్డి సంఘం పేద రెడ్డి విద్యార్థులకు తమవంతు చేయూతనందిస్తుందని, ఉన్నత విద్యకు అవసరమైన ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. ఈ క్యాలెండర్ ప్రచురణ, ఆవిష్కరణలకు సహకరించిన పెద్దలందరికి ధన్యావాదాలు తెలుపుతున్నామన్నారు.

ఇండియన్ ఫుష్‌అప్స్‌తో అశ్వనికుమార్‌కు భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు : కె.వి.రమణారావు

అశ్వనికుమార్‌కు భారత్ వరల్డ్ రికార్డ్స్‌ను అందజేస్తున్న రమణారావు, వేణుగోపాల్, అప్పాజీ, ఉమాజ్యోతి తదితర అతిథులు

నాంపల్లి, జనవరి 12 ప్రభాతవార్త : కేవలం 85.30 నిముషాల్లో అత్యధికంగా 1666 ఇండియన్ ఫుష్‌అప్స్ లో నిర్విరామంగా చేసి ప్రముఖ క్రీడాకారుడు లంక అశ్వనికుమార్ పాత్రుడు భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడని భారత్ వరల్డ్ రికార్డ్స్ నేషనల్ కోఆర్డినేటర్ లయన్ కె.వి.రమణారావు ప్రకటించారు. ఈమేరకు కె.వి.రమణారావు ప్రపంచ రికార్డు నమోదు పత్రాన్ని, మెడల్, మెమెంటోలను లంక అశ్వనికుమార్ పాత్రుడుకి హాజరైన అతిథులు ప్రముఖ నిర్మాత టి.వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టు పిఆర్ఓ ధీరజ అప్పాజీ, ఆర్కిటెక్ట్ రామానంద, దర్శక నిరాత్మత ప్రణవ స్వరూప్, ఉమాజ్యోతి తదితరులతో కలిసి అశ్వనికుమార్‌ను ఘనంగా సత్కరించి ప్రదానం చేసి ఎంతగానో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంత్రికి వన్నె తెచ్చిన విద్యార్థినీలు:హనుమంతరావు

విద్యార్థినీయులు వేసిన రంగుల వల్లులు

సైఫాబాద్, జనవరి 12 ప్రభాతవార్త: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ మహిళల్లో పోటి తత్వాన్ని పెంపొందిచాలనే ఉద్దేశంతో విద్యార్థినీలకు ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగిందని చైతన్య హబ్, శ్రీ మేధ జూనియర్, డిగ్రీ కళాశాలల ఛైర్మన్ వి.వి.హనుమంతరావు చెప్పారు. విద్యార్థినీలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింభించేలా వేసిన ఈ రంగువల్లులు అందరిని కట్టుకున్నాయని తెలిపారు. సంక్రాంతి పండువను పురస్కరించుకుని సోమవారం హిమాయత్‌నగర్‌లోని చైతన్య హబ్, శ్రీమేధా కళాశాలల్లో విద్యార్థినీలు సంక్రాంతి సంబరాలను ఆనందోత్సవాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రంగు, రంగుల సాంప్రదాయ వస్త్రాలను ధరించి సంక్రాంతి పండువకు వన్నె తెచ్చారని ఆయన కొనియాడారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి వేసిన రంగు, రంగుల ముగ్గులు, పువ్వుల అలంకరణ సుందరంగా ముస్తాబు చేశారని, ఈ వేడుకల ద్వారా విద్యార్థులకు సంక్రాంత్రి విశిష్టత, రైతుల కృషి, విలువ, ప్రకృతి పట్ల కృతజ్ఞత, భారతీయ సంప్రదాయాలపై అవగాహన పెంపొందిచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

నారాయణ్ గూడాలోని మేల్కొటే పార్క్‌లో జరిగిన ముగ్గుల పోటీలలో పాల్గొన్న కార్పొరేటర్ మహాలక్ష్మి , రామన్ గౌడ్ ,భూషణ్ రావు ,రమేష్ యాదవ్ ,జోగా రెడ్డి ,లక్ష్మణ్ కుమార్ ,రవీందర్, ఉదయ్,వాసు రవి,వినోద్

భారతదేశ తరగని సంపద శాస్త్రీయ సంప్రదాయ కళలు : త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

సన్మానగ్రహీత కళాకారులతో ఇంద్రసేనారెడ్డి, మోహనకృష్ణ, స్వర్ణ, పద్మజ రాంబాబు, శ్యామ్‌సుందర్ తదితర అతిథులు

రవీంద్రభారతి, జనవరి 12 ప్రభాతవార్త : సంప్రదాయ, శాస్త్రీయ సంగీత కళలు భారతదేశ తరగని సంపద అని త్రిపుర రాష్ట్ర గవర్నరు ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. నాదప్రభ అత్యుత్తమ సంగీతాన్ని సమాజానికి అందిస్తోందని, ఇటువంటి సంస్థల వల్లనే భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలు ఫరిడవిల్లుతాయని స్పష్టం చేశారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ నాదప్రభ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మరపురాని మధురగీతాలు శీర్షికన ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు డి.వి.మోహన్‌కృష్ణ, డా. స్వర్ణ మంగళంపల్లి వీనులవిందైన శాస్త్రీయ సంగీత గానం కావించారు. సుప్రసిద్ధ గాయకులు బి.శిరీష, చరణ్ భాస్కర్‌లు పలు లలితగీతాలను సుమధురంగా ఆలపించి సభికులను సంగీతలోకంలో విహరింపజేశారు. సాయికుమార్, పవన్‌కుమార్, రామారావు, చక్రపాణిలు అద్భుత వాద్యసహకారంతో కార్యక్రమాన్ని మరింత రక్తికట్టించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఇంద్రసేనారెడ్డి, విశిష్ట అతిథులు జె.రాంబాబు, అయ్యగారి శ్యామ్‌సుందర్, సంస్త వ్యవస్థాపకురాలు డా. కె.పద్మజ రాంబాబు తదితరులతో కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు. సభకు డా. పద్మజ రాంబాబు స్వాగతం పలికారు.

ఘనంగా ముగిసిన సంప్రదాయ సంకీర్తనోత్సవం

కళాకారులను సత్కరిస్తున్న కే.ఎస్.రావు

హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త: 16 రోజుల పాటు కొనసాగిన సంప్రదాయ సంకీర్తనోత్సవం 2026 ఘనంగా ముగిసింది. సోమవారం హోప్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో విద్వాంసురాలు అమృత వెంకటేష్ అందించిన మధురమైన గాన కచేరితో ఈ సంకీర్తనోత్సవం ముగిసింది. ఈ ఉత్సవాల సందర్భంగా, విద్వాన్ మోదుమూడి సుధాకర్, విదుషి కృతి విఠల్, విదుషి సవిత శ్రీరామ్, విదుషీమణులు లతాంగి సిస్టర్స్ అర్చన, సమత్వి, విద్వాన్ జె.ఎస్.శ్రీరాం, విద్వాన్ సింహాచల శాస్త్రి, విద్వాన్ అరవింద్, కమలకిరణ్ వింజమూరి, అభిషేక్ రఘురామ్, టి.ఎం.కృష్ణ, అమృత వెంకటేష్‌లతో సహా దక్షిణ భారత దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రముఖ సంగీత విద్వాంసులు ఉన్నత స్థాయి ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతి కచేరీని ప్రేక్షకులు ఆనందంగా వీక్షించి, కళాకారులను ప్రశంసించారు. కచేరి అనంతరం కళాకారులను, వాలంటీర్లను వారి విలువైన సేవలకు గుర్తింపుగా డైరెక్టర్లు కే.ఎస్.రావు, కే.సునీత ఘనంగా సత్కరించారు.

భారతీయ సంస్కృతికి ఆత్మ స్వామి వివేకానంద : బండారు దత్తాత్రేయ

బేగంపేట జనవరి 12,ప్రభాతవార్త

భారతీయ సంస్కృతికి సాంప్రదాయాలకు ఆత్మలాంటి వ్యక్తి స్వామి వివేకానందుడు అని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు.స్వామి వివేకానంద 164వ జయంతి సందర్భంగా సోమవారం ఆర్పీరోడ్డు స్వామి వివేకానంద వీధిలో స్వామి వివేకానంద సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రామకృష్ణ మఠానికి చెందిన స్వామి తత్పదానంద మహారాజ్‌తో,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావులతో కల్సి ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు చరిత్రను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానందుడు అని అన్నారు.భారతదేశం అన్ని మతాలు కులాలు కలిసి ఒకరినొకరు గౌరవించుకునే సంస్కృతి మనదని ఇది మన రక్తంలోనే ఉందని,దీన్ని ఎప్పటికీ ఆచరించాలని వివేకానంద బోధించాడని గుర్తు చేసారు.కేవలం ఆధ్యాత్మికత భావాలే కాకుండా జాతీయ భావాలతో ప్రతి ఒక్కరిలో ఉత్తేజాన్ని నింపిన దేశభక్తుడని కొనియాడారు.యువత దేశానికి మూల స్తంభాల్లాంటి వారని దేశ భవిష్యత్ వారిపై ఆధారపడి ఉందని,వివేకానందుడు చెప్పేవాడని,కానీ నేటి యువత డ్రగ్స్,మద్యం లాంటి వ్యసనాలకు బానిసలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.యువత ఇలాంటి చెడు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్ ఏమి కావాలని

స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ బండారు,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు,స్వామి తత్పదానంద.

ఆయన ప్రశ్నించారు.స్వామి వివేకానంద లాంటి గొప్ప వ్యక్తి అడుగిడిన ఇలాంటి స్థలం ఎంతో పవిత్రమైందని ఇక్కడ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు.స్వామి తత్పదానంద మహారాజ్ స్వామి వివేకానంద ఆదర్శభావాల గురించి బోధించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ వివేకానందుని మార్గమే నేటికి చెక్కు చెదరకుండా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని,మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధరరెడ్డి,కార్పోరేటర్లు సుచరిత,కొంతం దీపిక,కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ,బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్,కొత్త నాగనాథం,అసోసియేషన్ నాయకులు దయానంద్,శ్రీరాములు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేత

అడ్డగుట్ట,జనవరి 12 ప్రభాతవార్త: సంక్రాంతిని పురస్కరించుకొని మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మారేడ్‌పల్లి షెనాయ్ గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న 100 మంది మహిళలకు ఒక్కొక్కరికి 6 వేల రూపాయల విలువ చేసే గ్యాస్ స్టౌవ్‌లను అందజేశారు. అదే విధంగా ప్రథమ బహుమతికి వాషింగ్ మిషన్, ద్వితీయ బహుమతి మిక్సీ గ్రైండర్, తృతీయ బహుమతి టేబుల్ ఫ్యాన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వైష్ణవి యాదవ్ మాట్లాడుతూ మోండా డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులోఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

మారేడ్‌పల్లిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు ప్రధానం చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు వైష్ణవి యాదవ్ తదితరులు

మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభకనబర్చాలి : నర్మద

కంటోన్మెంట్,జనవరి 12 ప్రభాతవార్త: మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభకనబర్చాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకొని మహంకాలి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు బి.ఎన్.శ్రీనివాస్, ఆధ్వర్యంలో సోమవారం 3వ వార్డు మడ్‌పోర్ట్‌లో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించని ముగ్గుల పోటీ, రంగోళి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అరుణ్, భాగ్యలక్ష్మి, వినోద, అనురాధ, రేఖా తదితరులు పాల్గొన్నారు.

3వ వార్డులో బహుమతులు అందజేస్తున్న బోర్డు మెంబర్ బానుక నర్మధ తదితరులు

తెలంగాణ అగ్రివర్సిటీలో కొత్తగా టీచర్స్ అసోసియేషన్

అత్తాపూర్ జనవరి12,ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో టీ

ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలి : పాస్టర్ ప్రభు చరణ్

క్రిస్టియన్ లైఫ్ సెంటర్ లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పాస్టర్లు వన్య ఇమ్మానుయేల్ తదితరులు

మలక్ పేట జనవరి 12, ప్రభాతవార్త: ప్రజలు ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్, సీనియర్ పాస్టర్ ప్రభు చరణ్, పాస్టర్ వన్య ఇమాన్యుల్ లు పేర్కొన్నారు. ముసారాంబాగ్ లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో వారి ఆధ్వర్యంలో లవ్ ఫిస్ట్ వేడుకలను ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ధర్మ మార్గాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. ప్రేమ, కరుణ ద్వారా ఏసుక్రీస్తు మానవాళిలో ఆనందాన్ని, సంతోషాలను నింపారని పేర్కొన్నారు. సోదర భావంతో శాంతియుత వాతావరణంలో కలిసిమెలిసి ప్రశాంతంగా సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. శాంతి, కరుణ సహనం, ప్రేమ విలువల గురించి ఏసుప్రభువు సర్వ మానవాళికి తెలియజేశారని వివరించారు. ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి పలు సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

మల్కాజిగిరి జనవరి12, ప్రభాతవార్త

జలమండలి ఎండి అశోక్ రెడ్డిని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలసి డివిజన్ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. అలగే కలుషిత నీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బాబు సత్య నారాయణ అశోక్ తదితరులు పాల్గొన్నారు

భరత్‌నగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు



మల్కాజిగిరి జనవరి12, ప్రభాతవార్త

మోలాలి డివిజన్‌లలోని భారత్ నగర్ లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సతీమణి శ్రీమతి మర్రి మమతా రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు.భరత్ నగర్ లో అన్నమ్మ గారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళల రంగవల్లికలను మమతా రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. చక్కటి రంగుల కలయికతో, సృజనాత్మకతను ప్రతిబింబించే ముగ్గులు వేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆడపడుచులకు బహుమతులు అందజేశారు. అనంతరం అందరికీ హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంశీ ముదిరాజ్, మారుతి ప్రసాద్, ఉష, అన్నమ్మ, సునందరావు, మదన్ మూర్తి ఆదినారాయణ సంతోష్ గుప్తా, కృష్ణ, దుర్గేష్ కిరణ్ స్వామి , చక్రి, రాణి, విజయ లక్ష్మి, స్వరూప, పర్వీన్ అలాగే స్థానిక కాలనీల వాసులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రాహుల్ గాంధీ పై తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదు: ముత రాహుల్

కెటిఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హైదరాబాద్ నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత రాహుల్, ఓల్డ్ మలకపేట్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి. విష్ణు దేవ్ తదితరులు

మలక్ పేట, జనవరి 12, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని హైదరాబాద్ నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత రాహుల్ పేర్కొన్నారు.రాహుల్ గాంధీ పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన "తప్పుడు మరియు నిరాధారమైన" వ్యాఖ్యలకు నిరసనగా, హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత రాహుల్ నాయకత్వంలో మూసారాంబాగ్ ఎక్స్ రోడ్స్ వద్ద ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుగుడల విష్ణు దేవ్ తో పాటు నాయకులు, కార్యకర్తలతో కలిసి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటీఆర్ తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు . వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మలక్‌పేట్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోడుప్పల్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, చైర్మన్ రాపోలు రాములు, కొత్త కిషోర్ గౌడ్ , ఫెడరేషన్ సభ్యులు

బోడుప్పల్, జనవరి 12 ప్రభాతవార్త ; జిహెచ్ఎంసి బోడుప్పల్ సర్కిల్ బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు ఆధ్వర్యంలో ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగళ్ళ యాదగిరి, ఫెడరేషన్ నాయకులు , సభ్యులు తదితరులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. ఫెడరేషన్ యొక్క కృషి, బోడుప్పల్ అభివృద్ధి తదితర అంశాలు సుదీర్ఘంగా ప్రస్తావించి ఫెడరేషన్ సభ్యులు అభినందించారు .ఫెడరేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు .



తొర్రూరు డివిజన్ కమ్మగూడ వరిధిలో వివేకానంద చౌరస్తాలో మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి ,తదితరులు

కర్మన్‌ఘాట్‌లో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

రామంతాపూర్‌లో స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ వరిధిలోని ఈస్ట్ ఇందిరా నెహ్రూ నగర్ లో గల స్వామి వివేకానంద విగ్రహానికి కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జిల్లెలగూడలో వివేకానందుని జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి: చిత్రంలో సిద్దాల బీరప్ప, దీప్‌లాల్, అనిల్ యాదవ్ తదితరులు

స్వామివివేకానంద జయంతి సందర్భంగా రామకృష్ణాపురం డివిజన్ వరిధిలోని కొత్తపేట రైతుబజార్ రిలయన్స్ పెట్రోల్‌బంక్ వద్ద గట్ల వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గట్ల రవీంద్ర, గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి

తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెవైయం నాయకులు మారగోని విశాల్ గౌడ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద కు బిజెపి రాష్ట్ర నాయకులు బచ్చిగళ్ళ రమేష్ రైతు సేవాసహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రామ్ రెడ్డి నివాళులర్పిస్తున్న దృశ్యం

చిలుకానగర్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

చంపాపేటలో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నల్ల రఘుమారెడ్డి, సామ రమణారెడ్డి



ఉప్పల్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి తదితరులు

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి నిదర్శనం : లింగాల రాహుల్‌గౌడ్

ఎల్.బి.నగర్, జనవరి 12 ప్రభాతవార్త: పండుగలు తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనమని కొత్తపేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తపేట జైన్‌మందిర్ వద్ద సోమవారం మెగా ముగ్గులపోటీ కార్యక్రమాన్ని నిర్వహించగా మహిళలు పెద్దఎత్తున హాజరై రంగురంగుల ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. వేసుకునే బట్టలు స్త్రీల గౌరవాన్ని పెంచేలా ఉండాలని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజాపథకాలు, జైజవాన్ జైకిసాన్, దేశానికి రైతేరాజని, జవాన్ దేశానికి రక్షా అని, చెట్లను, పర్యావరణాన్ని రక్షించాలని, ధనుర్మాసం మకర సంక్రాంతి ప్రాధాన్యత, శ్రీపాండురంగస్వామి, మహిళ లేనిదే సృష్టికి మూలం లేదని, వెంకటేశ్వరస్వామి నామాలు, శంఖ, చక్రాలు, గంగిరెద్దు, హరిదాసులు తదితర అంశాలతో కూడిన ముగ్గులు అందరిని మంత్రముగ్ధులను చేశాయి. విజయగౌడ్, సునీల రెడ్డి, పద్మ, రూపాసింగ్, విజయ న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు భాగ్యశ్రీ ప్రథమ, మానస ద్వితీయ, ప్రసన్నలక్ష్మి తృతీయ, నర్మద నాలుగవ బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగల నాగేశ్వరరావు, మల్లేశం, మురళీధర్‌రావు, కామేశ్వరరావు, రామారావు, లింగాల నరేందర్‌గౌడ్, అంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న లింగాల రాహుల్‌గౌడ్

వెయ్యి కోట్ల స్థలంలో కురుమ భవనం నిర్మించాం : ఎగ్గే మల్లేషం

సరూర్‌నగర్, జనవరి 11 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఏ కులానికి లేని విధంగా కోకాపేటలో నేడు దాదాపు వెయ్యి కోట్ల రూపాయల విలువ చేసే ఐదు ఎకరాల స్థలంలో దొడ్డి కొమురయ్య పేరిట కురుమ ఆత్మ గౌరవ భవనం నిర్మించామని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గే మల్లేషం కురుమ వెల్లడించారు. జిల్లెలగూడ/మీర్‌పేట్‌లోని సిద్దాల దశరథ కాంప్లెక్స్ కనకదుర్గ కన్వెన్షన్ హాల్‌లో రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ ఆధ్వర్యంలో నిర్వహించిన కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. మల్లేషం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలకమైన రంగారెడ్డి జిల్లాలో సంఘ భవనం కోసం జిల్లా కలెక్టరేట్ భవనం సమీపంలో ఒక ఎకరం స్థలం కోసం సిఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో కురుమ సంఘం భవనాలను నిర్మించడానికి కృషి జరుగుతున్నదనీ గతంలోనే తాను భవనాల కోసం ఎమ్మెల్సీ నిధులను కేటాయించగా ప్రస్తుతం ఐదారు, జిల్లాల్లో భవనాల నిర్మాణం పూర్తికావస్తున్నదని వివరించారు. కురుమలు విద్యా, ఉద్యోగ రంగంలో ముందుకు పోవడానికి నగరంలోని హిమాయత్ నగర్ లేదా అశోక్‌నగర్‌లో సంఘం తరపున భవనాన్ని కొనుగోలు చేసి అందులో కురుమల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు. వచ్చే జిహెచ్ ఎంసి ఎన్నికల్లో కురుమలు ఏ పార్టీలో ఉన్నా కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేయాలనీ కనీసం ఐదారు మంది కార్పొరేటర్లు అయినా ఎన్నిక కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇంఛార్జి క్యామ మల్లేష్ కురుమ, ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం కురుమ, ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ కురుమ, కార్యదర్శి కొలుకుల నర్సింహ కురుమ, జిల్లా కార్యదర్శి యెగ్గెడి సత్తయ్య కురుమ, నాయకులు రాయప్ప, ఇక్కె సత్యనారాయణ, ఇక్కె కొండల్, సిద్దాల జగదీశ్, జోరల ప్రభాకర్, సిద్దాల జంగయ్య, జెట్ట బాలయ్య, దొడ్డి శ్రీశైలం, రావుల పోచయ్య, మేకల సంజీవ, దొడ్డి శ్రీనివాస్, కాట్నె పద్మ, రేణుక పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గే మల్లేషం: చిత్రంలో రంగారెడ్డి జిల్లా సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ తదితరులు

రామంతాపూర్‌లో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

రామంతాపూర్,, జనవరి 12 ప్రభాతవార్త : రామంతాపూర్ చిన్న చెరువు మైదానంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రిసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబంభించే విధంగా మహిళలు సంక్రాంతి ముగ్గుల పోటీలలో పాల్గొనడం హర్షనీయమన్నారు. మహిళలకు తగు సహకారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా చిన్న చెరువు మైదానంలో రంగురంగుల ముగ్గులు వేసి ఆలరించారు. అనంతరం విజేతలు సృజన, సాకేత, నవ్యశ్రీలకు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఎం.డి.తౌఫిక్, ఎండి.రఫిక్, జల్లీల్ పాషా, కంది శ్రవణ్ రెడ్డి, నామ్ రాజి రెడ్డి, పూస సత్తయ్య, గరిక సుధాకర్,ఉపేందర్ రెడ్డి, నరసింహ రెడ్డి, ముత్యాల బాబు, శామ్యూల్, బుల్లెట్ అశోక్, మిట్టు,హరీష్, సందీప్, భాస్కర్, కాశమల్ల శంకర్, సతీష్ గౌడ్, జిల్లు, అశోక్, శ్రీనివాస్ గౌడ్,పెంటయ్య,యాదగిరి రెడ్డి, ఉదయ్, జి స్వామి, కె స్వామి, శాగ శ్రీధర్, నయీం, చింటూ, యోగి, రవి,చింటూ, గౌతమ్, కిరణ్, శరత్, కిషోర్, హరీష్ రెడ్డి, విజయ్, కన్న యాదవ్, మల్లేష్ యాదవ్, సంజీవ, రాజు కుమార్, సలీమ్, మల్లికార్జున్, మెంగా శోభ, అంబికా, బెజ్జం శోభ, నవీన్, శ్రేయాస్, రామకృష్ణ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు తిలకిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డి తదితరులు

దేవాలయాభివృద్ధికి రూ.51 వేల వితరణ

చెక్కును అందజేస్తున్న బొక్క సదానందరెడ్డి

సైదాబాద్, జనవరి 12 ప్రభాతవార్త: కర్మన్‌ఘాట్‌లోని శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం చంపాపేట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొక్క సదానంద రెడ్డి రూ.51 వేలను దేవాలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి ఛైర్మన్ కొరిపల్లి లక్ష్మయ్య, కమిటీ సభ్యులు వసంత్, పురుషోత్తం, నవీన్, విజయ్, బాలకృష్ణ, కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి: సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 12 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రశాంతిహిల్స్ డివిజన్-58కి సంబంధించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిఆర్ఎస్ పార్టీదే విజయంకావాలనిఅన్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూ టీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, దీప్‌లాల్ చౌహాన్, డివిజన్ ముఖ్య నాయకులు జఠావత్ శ్రీనివాస్ నాయక్, జమాల్ పూర్ సునీత బాలరాజ్, దిండు భూపేష్‌గౌడ్, లలితా జగన్, పల్లె జంగ య్యగౌడ్, దోమలపల్లి రాజ్‌కుమార్, రామిడి నర్సిరెడ్డి, తుమ్మల నిర్మలా రెడ్డి, హాము నాయక్, ఎండి రజాక్, సౌందర్య విజయ్‌లతో పాటు జిల్లెల గూడ మాదరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతిహిల్స్ డివిజన్ నేతలకు దిశానిర్దేశం చేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

సంఘం సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తాం

గౌడ సంఘం అధ్యక్షుడు కేశవ నాదం గౌడ్

గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు వేముల కేశవనాదం గౌడ్, ఆలేటి శ్రీనివాస్ గౌడ్, కొంపల్లి వెంకట్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు

మేడిపల్లి, జనవరి 12 ప్రభాతవార్త ; గౌడ సం ఘం సంక్షేమం కోసం నిరంతరం కృషి చే స్తామని బోడుప్పల్ లో నిర్వహిం చిన ఒక కార్యక్రమంలో ఆ సంఘం నేతలు వేముల కేశవనాథం గౌడ్, పవన్ సాయి హాస్పిటల్ అధినేత డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, జై గౌడ్ ఉద్యమ ఉపాధ్యక్షులు కొంపల్లి వెంకట్ గౌడ్ లు అన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ... గౌడ సంఘం ఆధ్వర్యంలో గీత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ రానున్న రోజుల్లో పార్టీలకు అతీతంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి రంగా నాగభూషణం గౌడ్, ట్రెజరర్ బత్తుల సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కోటి లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షులు ఉక్కూరి రమేష్ గౌడ్, ప్రచార కార్యదర్శి పల్లె మల్లేశం గౌడ్, సహాయ కార్యదర్శి, బాల్ రాజు గౌడ్, కార్యవర్గ సభ్యులు వి. భాస్కర్ గౌడ్, ఎం రమేష్ గౌడ్, పి విజయ్ కుమార్ గౌడ్, తాళ్లపల్లి అంజయ్య గౌడ్, వేముల రాజు గౌడ్, సలహా దారులు చంద్రయ్య గౌడ్, పల్లె అమృతం గౌడ్, పల్లె మైసయ్య గౌడ్, పలుసం శంకర్ గౌడ్, బత్తిని ముత్యాలు గౌడ్, విజయ్ కుమార్ గౌడ్, బిక్షపతి గౌడ్, ఆనందం గౌడ్, గౌడ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి : ప్రిన్సిపల్ అప్పారావు

పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు తదితరులు

మలక్ పేట, జనవరి 12, ప్రభాతవార్త: యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని అవంతి డిగ్రీ పీజీ, కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, వివేకానంద మెమోరియల్ సంస్థ సభ్యులు శకుంతల పేర్కొన్నారు. అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో వివేకానంద మెమోరియల్ సంస్థ సహకారంతో యువ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కైట్ ఫెస్టివల్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు వారు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ మోహన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్ వాల్వాలో ముగ్గుల పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నల్ల రఘుమారెడ్డి

సైదాబాద్, జనవరి 12 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్ సుల్తాన్ వాల్వా అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ఛైర్మన్ నల్ల రఘుమారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నాడు మహిళలు అందమైన రంగ వళ్లులను తమ ఇంటి ముందు తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బైగళ్ల రాము, కొత్తపేట ప్రభాకర్, దొబ్బ నర్సింహా, బైగళ్ల నర్సింహా, గోకుల్ సరోజ, ప్రేమ్ కుమార్, స్వప్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మంచినీటి పథకాన్ని అమలు చేయాలి: బిజెపి

జలమండలి ఎండికి వినతి పత్రం ఇస్తున్న బిక్షపతిచారి తదితరులు

సరూర్‌నగర్, జనవరి 12 ప్రభాతవార్త: పునర్వవస్థీకరించిన జిహెచ్ఎంసిలో విలీనమైన మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో కొత్తగా ఏర్పాటైన డివిజన్లలో పేద వర్గాలకు హైదరాబాద్ నగరంలో మాదిరిగానే ఉచిత నీటి సరఫరా చేయాలని బిజెపి నాయకులు జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మీర్‌పేట్, బడంగ్‌పేట్ క్లస్టర్ల బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో ఎండిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిహెచ్ఎంసిలోని పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నెలకు 20 వేల లీటర్ల వరకు ఉచిత మంచి నీటి పథకాన్ని అమలు చేస్తున్నారనీ ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసిలో విలీనమై కొత్తగా ఏర్పాటైన నాదర్‌గుల్, ప్రశాంతిహిల్స్, జిల్లెలగూడ, మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్ డివిజన్లలో అర్హులైన ప్రజలకు ఆ పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు ద్యాసాని తిరుపతిరెడ్డి, ఇంద్రావత్ రవినాయక్, సిద్దాల శ్రీనివాస్, మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కోడూరు సోమేశ్వర్, నాయకులు చెవ్వ శ్రవణ్‌కుమార్, భీమ్‌రాజ్, నిఖిల్ సింగ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో లక్ష మందికి గృహ జ్యోతి పథకం : పరమేశ్వర్‌రెడ్డి

గృహ జ్య